## ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో పలు అంశాలను పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

మందమర్రి రూరల్, ఏప్రిల్ 29 : మండలంలోని పది గ్రామపంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్, 2024 నుంచి మార్చి, 2025 వరకు రూ.3,32,87,000తో వివిధ పనులు చేపట్టారు. వీటిపై పది బృందాలతో డీఆరీపలు, ఎస్ఆర్పీలు, వీఏలు తనిఖీ చేశారు. కాగా, అవకతవకల అంశాన్ని సామాజిక తనిఖీ అధికారి కుమార్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీ కార్యదర్శులు, టీఏలు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని పలు గ్రామాల్లో రిజిస్టర్ల నిర్వహణ సరిగాలేదని తెలిపారు. అనంతరం డీఆర్డీవో కిషన్ మాట్లాడుతూ.. తనిఖీల్లో అవకతవకలు గుర్తించి, నిర్లక్ష్యం చేసిన పది గ్రామపంచాయతీలకు జరిమానా విధించినట్లు తెలిపారు. రికార్డుల పరంగా రూ. 81,922 పెనాల్టీ రికవరీకి ఆదేశించారు. డీఆర్డీఏ జిల్లా విజిలెన్స్ అధికారి కిరణ్, ఎంపీడీవో రాజేశ్వర్, మండల ప్రత్యేకాధికారి అనిత, ఏపీవో రజియా, అంబుడ్స్‌మన్ శివరాం, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు

- ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల ఎదుట బీజేపీ నాయకుల నిరసన

బెల్లంపల్లి, ఏప్రిల్ 29 : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఉన్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ ఆరోపించారు. జాబితాలో పూర్తిగా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అర్హులైన పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కోయిల్కర్ గోవర్ధన్, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణాధ్యక్షురాలు దార కల్యాణి, నాయకులు శ్రావణ్, నవీన్‌కుమార్, నర్సింగ్, అరవింద్, స్రవంతి, సుమలత, శ్రీనివాస్, రాములు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా భరోసా సెంటర్లు



మాట్లాడుతున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 29 : బాధిత మహిళలు, పిల్లలకు అండగా భరోసా సెంటర్లు సేవలు అందిస్తున్నాయని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. నస్పూర్‌లోని జిల్లా భరోసా సెంటర్‌లో మంగళవారం బాధిత మహిళలు, పిల్లలకు రూ.45 వేల చెక్కులను అందజేశారు. ఉమెన్స్ సేఫ్టీ విభాగం ద్వారా వచ్చిన విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ మంజూరు కాగా, ఎడ్యుకేషన్ సపోర్ట్ కింద ముగ్గురికి రూ.15 వేలు, సెల్ఫ్ బిజినెస్ కింద మరో ముగ్గురికి రూ.10 వేల చెక్కులను పంపిణీ చేశారు. బాధితులకు కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని, 180 బీఎన్ఎస్ఎస్, 183 బీఎంఎస్ఎస్ స్టేట్‌మెంట్ రికార్డుల్లో, మెడికల్ ఎగ్జామినేషన్‌లో సపోర్ట్ ఉంటుందని తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా బాధిత మహిళలు, బాలికలకు పోలీస్ సేవలు, కౌన్సెలింగ్, వైద్యం, న్యాయ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేశ్, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

## 4న జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

రెబ్బెన, ఏప్రిల్ 29 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు మంచిర్యాల జిల్లా మందమర్రిలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో మే 4వ తేదీన నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ సంపత్‌కుమార్, ఉమ్మడి జిల్లా చెస్ కన్వీనర్ ఈగ కనకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–7, అండర్–9 విభాగాల్లో ఎంపిక పోటీలుంటాయని పేర్కొన్నారు. అలాగే అండర్–15 బాలబాలికలకు చాంపియన్‌షిప్ పోటీలు ఉంటాయని తెలిపారు. పాల్గొనేవారు 3వ తేదీలోగా రూ.200 ప్రవేశ రుసుముతో చీఫ్ ఆర్బిటర్ అంబాల కల్పన వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 89781 46456 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## సమ్మెలో పాల్గొనాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 29 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, పారిశ్రామిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని, విజయవంతం చేయాలి టీఎస్‌యూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపెల్లి కుమారస్వామి, కార్యదర్శి సమ్ము రాజయ్యల పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 3, 1, ఓసీపీ, ఆర్కే 6, 7, న్యూటెక్ గనులపై సమావేశాలు ఏర్పాటు చేశారు. కార్మికులకు కరపత్రాలు అందజేశారు.

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 29 : మండలంలో ఎల్కపల్లి జీపీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మే 20 జరిగే దేశవ్యాప్త సమ్మెపై మండల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా సభ్యుడు కృష్ణమాచారి, మండల గౌరవాధ్యక్షుడు ఘనపురం శ్రీకాంత్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల కార్యదర్శి దిగిడే మల్లిక, మండల నాయకులు కొడ్ప పద్మ, చందా పద్మ, కరుణాకర్ పాల్గొన్నారు.

రెబ్బెన, ఏప్రిల్ 29 : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోషమల్లు, ఎస్‌జీకేఎస్ రాష్ట్ర నాయకుడు మహేందర్ పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం కార్యాలయం ముందు ధర్నా చేపట్టి, జీఎంకు వినతిపత్రం అందించారు. నాయకులు బండారి తిరుపతి, గోలేటి శ్రీనివాస్, పోశం, సుభాష్, గైని తిరుపతి ఉన్నారు.

**PUBLIC NOTICE**

My client by name **KATTA KRUNAKAR,** S/o. Devedasu, Age: 56 years, Occ: SCCL Employee, R/o. Q.No. D-1344, Shirke Colony, Naspur, Mdl: Naspur, Dist.: Mancherial, he has lost his land original registered link Document No. 4087/2003, Dt. 23-06-2003, which were registered before SRO Mancherial, is lost when he was get xerox at Mancherial Market Area, he tried to trace out the same but in vain. If any one finds the above said document, they shall have handover the same to me. He approaches State Bank of India, Reddy Colony, Branch, Mancherial for obtaining loan and also anyone is having any objections about the property covered under Register Sale Deed inform to the below address within one week from the date of publication otherwise the Bank will proceed further.

**SCHEDULE OF PROPERTY**

House plot an extent of 250.17 Sq.Yds = 209.16 Sq.Meters, situated in Sy.No. 327/1 of Garmilla Shivar, Within the limits of Mancherial Municipal Corporation, Mdl: Mancherial, Dist. Mancherial.

**BOUNDARIES:**
East : 20 Feet Road
West: Land of Mekala Kanakaiah
North: House of Koduri Srinivas H.No. 27-395/15-38
South: House of Gaddam Ramagoud H.No. 27-395/15-69

Yours sincerely
Sd/- **N.Kamala Manohar Rao,** Advocate
4-197, Near LIC Office, Mancherial.

## దరఖాస్తుల పరిశీలన

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 29 : మండలంలోని రాహపల్లి, అప్పపెల్లి, రౌట సంకెపెల్లి గ్రామాల నుంచి రాజీవ్ యువ వికాసం కింద అభ్యర్థులు అందించిన దరఖాస్తులను ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. అర్హులైన వారికి యూనిట్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్ : మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ 29 : మాదక ద్రవ్యాల నియంత్రణకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాలను వినియోగించడం వల్ల కలిగే నష్టాలను ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనంతో పాటు, వివిధ రకాల పద్ధతులుగా విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. విద్యార్థుల అసాధారణ ప్రవర్తనను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు చేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు సంబంధిత గోడ ప్రతులను విడుదల చేశారు.

**నూతన బార్ కోసం డ్రా..**

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 29 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతన బార్ కోసం డ్రా తీసి లక్కీ విన్నర్‌ను ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్, ఎక్సైజ్ సీఐ గురవయ్యతో కలిసి దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీశారు. గుడిపేటకు చెందిన నడిపెల్లి ధనుంజయ్ రావు ఎంపికైనట్లు చెప్పారు. దరఖాస్తుదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకునేలా వన్యప్రాణులు



అడవిలో మేత మేస్తున్న అడవి బర్రెలు



పరుగెత్తుతున్న నీలుగాయిలు



నీరు తాగుతున్న చుక్కల దుప్పులు

హాజీపూర్, ఏప్రిల్ 29 : హాజీపూర్ మండలం ఎంసీసీ క్వారీ పాత మంచిర్యాల సెక్షన్ తిమ్మాపూర్ బీట్‌లో అటవీ శాఖ అధికారులు సఫారీ ట్రాక్ వెంట నీటి గుంతలు, గడ్డి మైదానాలు ఏర్పాటు చేశారు. వేసవిలో గడ్డి, నీటి కోసం అడవి జంతువులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. అడవి బర్రెలు, నీలుగాయిలు, చుక్కల దుప్పులు, కొండ గొర్రెలు సోమవారం కెమెరాకు చిక్కినట్లు స్పష్టం చేశారు. జంగిల్ సఫారీకి వచ్చే పర్యాటకులను ఆకట్టుకోనున్నట్లు లక్సెట్టిపేట ఫారెస్టు రేంజర్ సుభాష్ తెలిపారు.

# నిత్యం వినూత్న ప్రయోగాలు చేయాలి

- విజ్ఞాన శిబిరం సందర్శన
- మంచిర్యాల డీఈవో యాదయ్య





నస్పూర్ : విజ్ఞాన శిబిరాన్ని సందర్శిస్తున్న డీఈవో యాదయ్య

నస్పూర్, ఏప్రిల్ 29 : ప్రతి రోజూ ఏదో ఒక వినూత్న ప్రయోగం చేయాలని మంచిర్యాల డీఈవో యాదయ్య విద్యార్థులకు సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. వారు నేర్చుకున్న అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు చేసిన ప్రదర్శనలను చూసి, సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్ చౌదరి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ఉపాధ్యాయులు హుస్సేన్, తిరుపతి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

**ఏకరూప దుస్తులు సిద్ధం చేయాలి**

తాండూర్, ఏప్రిల్ 29 : విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పాఠశాలల ప్రారంభానికి ముందే ఏకరూప దుస్తులను అందించేలా చర్యలు తీసుకోవాలని, పూర్తయిన వాటిని ఎమ్మార్సీ కార్యాలయానికి అందించాలని డీఈవో అన్నారు. తాండూర్ మండల పరిధిలో ఏకరూప దుస్తులు కుట్టే కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల తీరును చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో ఎస్ మల్లేశం, జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, డీసీఈబీ కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది తిరుపతి, స్టిచ్చింగ్ సెంటర్ నిర్వాహకులు ఉన్నారు.

**పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉంచాలి..**

మందమర్రి రూరల్, ఏప్రిల్ 29 : 2025–26 నూతన విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి మండలంలోని విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉంచాలని డీఈవో అన్నారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాల నమోదును పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు విద్యార్థులకు అందించేందుకు సిద్ధం చేయాలన్నారు. అనంతరం డీఈవోను ఘనంగా సన్మానించారు. సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంఈవో దత్తుమూర్తి, ఎమ్మార్సీ సిబ్బంది మధు, శ్యామ్, సీఆర్పీ రాంచందర్, సుభాషిని పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 29 : అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్డులో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ప్రవీణ్ కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెల్లి వెంకట రెడ్డి కొడుకు లక్ష్మీనారాయణ(30) ఎన్టీపీసీలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. వెంకట్ రెడ్డి సింగరేణిలో విరమణ పొందాడు. మూడేళ్ల క్రితం వెంకట్ రెడ్డి భార్య అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి వెంకట్ రెడ్డి మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో మతిస్థిమితం కోల్పోయాడు. కొడుకు లక్ష్మీనారాయణ దగ్గరుండి తండ్రిని చూసుకుంటున్నాడు. లక్ష్మీనారాయణ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మద్యం తాగి, ఇంటికి వచ్చి పడుకునానడు. అప్పటి నుంచి బయటకు రాలేదు. మంగళవారం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సోఫాలో లక్ష్మీనారాయణ పడుకొని మృతి చెందినట్లు, దర్వాజ ముందే వెంకట్ రెడ్డి పడి ఉన్నట్లు గుర్తించారు. కొడుకుకు ఏమైందని పోలీసులు అడుగగా, పడుకున్నాడని చెప్పడం స్థానికులు, పోలీసులను ఆశ్చర్యానికి గురి చేసింది. మృతదేహన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించి, వెంకట్ రెడ్డిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. వెంకట్ రెడ్డి బంధువు గూడెల్లి శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## వేటగాళ్ల ఉచ్చుకు తగిలి ఎద్దు మృతి

కన్నెపల్లి, ఏప్రిల్ 29 : కన్నెపల్లి మండలం మెట్‌పల్లి గ్రామంలోని పంట పొలాల సమీపంలో వేటగాళ్లు అడవి పందులు, వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ ఉచ్చుకు తగిలి బోర్ల శ్రీనివాస్‌కు చెందిన ఎద్దు సోమవారం రాత్రి మృతి చెందింది. శ్రీనివాస్ తన ఎడ్లబండితో పక్క గ్రామమైన లింగాలకు వెళ్తుండగా, వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చుకు ఎద్దు తగిలింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన శ్రీనివాస్, మరొకరు నారాయణ ఎడ్లబండి నుంచి కిందకు దూకారు. మరో ఎద్దును ప్రమాదం నుంచి కాపాడారు. అనంతరం గ్రామంలోకి వచ్చి గ్రామస్తులకు తెలపడంతో విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి కరెంటు సరఫరాను నిలిపివేయించారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలాన్ని కన్నెపల్లి ఎస్ఐ గంగారాం, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పంచానామా నిర్వహించారు. ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు. కాగా, కొద్ది రోజులుగా వేటగాళ్లు ఉచ్చులు అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్నారు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు స్పందించి, వేటగాళ్లను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## టేకు దుంగల పట్టివేత

కాగజ్‌నగర్, ఏప్రిల్ 29 : కాగజ్‌నగర్ మండలం సీతానగర్ సమీపంలోని గొల్లగూడలో అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను మంగళవారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు కాగజ్‌నగర్ ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్ తన సిబ్బందితో దాడులు చేయగా, రూ.5 లక్షల విలువ గల దుంగలు పట్టుకున్నట్లు స్పష్టం చేశారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుపనున్నట్లు చెప్పారు. డీఆర్వో బాబు పటేకర్, ఎఫ్ఎస్‌వో జగన్, కామరాజ్, మనోహర్, ఆస్మ, ఎఫ్‌బీవోలు మనోహర్, గిరిబాబు, శ్రీవాణి, వాణి, అరవింద్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

పెంచికల్ పేట్, ఏప్రిల్ 29 : మండలంలోని చేడువాయి సెక్షన్ పరిధిలో అడవి సార్సాల గ్రామ శివారులో వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. ఎఫ్ఎస్వో అస్మా తెలిపిన వివరాల ప్రకారం.. సమీప అటవీ ప్రాంతం నుంచి ఉదయం 7.30 గంటల సమయంలో వీధి కుక్కలు చుక్కల దుప్పిపై దాడి చేశాయి. గ్రామస్తులు గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొని వైద్యం అందించినప్పటికీ దుపిప మృతి చెందింది. పంచనామా నిర్వహించి, దహనం చేసినట్లు ఎఫ్ఎస్వో తెలిపారు.

## ముందస్తు అరెస్ట్

నస్పూర్, ఏప్రిల్ 29 : విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టగా, బీసీ విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో నాయకులు అఖిల్, శ్రావణ్, రాజ్‌కుమార్ ఉన్నారు. వెంటనే ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

మందమర్రి రూరల్, ఏప్రిల్ 29 : మండలంలోని పొన్నారంలో మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ చెన్నూర్ ఏడీఏ బానోత్ ప్రసాద్ మంగళవాం ప్రారంభించారు. ఏఈవో ముత్యం తిరుపతి, ఏవో కనకయ్య, కో ఆపరేటివ్ సొసైటీ సెక్రటరీ నరేశ్, పీపీసీ సెంటర్ ఇన్‌చార్జి మల్లేశ్, రైతులు పెంచాల మధు, పెంచాల రంజిత్, చిందం మల్లేశ్, పెంచాల అంజన్న, రాజయ్య, తోట నారాయణ, జాడి చంద్రయ్య, జాడి మల్లక్క, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత

లక్సెట్టిపేట, ఏప్రిల్ 29 : దండేపల్లి మండలం రాజంపేట గ్రామానికి చెందిన బంబడి సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, లక్సెట్టిపేట పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో మంగళవారం బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును మంచిర్యాల రీజనల్ మేనేజర్ నితీశ్ కుమార్ అందజేశారు. సాయికుమార్ ఎస్‌బీఐలో ఖాతా కలిగి ఉన్నాడు. దీంతోపాటు ఇన్సూరెన్స్ కోసం రూ.వెయ్యి చెల్లించాడు. మూడు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు మృతి చెందాడు. బ్రాంచ్ మేనేజర్ ఆనన్ హక్, అసిస్టెంట్ మేనేజర్ అశోక్, అనిల్ కుమార్, బ్యాంక్ సిబ్బంది శివకృష్ణ, సత్యనారాయణ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట ధర్నా

శ్రీరాంపూర్, ఏప్రిల్ 29 : సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం హెడ్‌ఆఫీస్ ఎదుట బుధవారం నిరసన దీక్షా, ధర్నా చేపట్టినట్లు ఆ సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉల్లి మొగిళి, టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తోకల రమేశ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్, ఏఐఎఫ్‌టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ పోశమల్లు, రాష్ట్ర కార్యదర్శి రత్నకుమార్ మాట్లాడారు. సింగరేణిలో 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు లావణ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## మే డే పోస్టర్ల విడుదల

కన్నెపల్లి, ఏప్రిల్ 29 : కన్నెపల్లి మండల కేంద్రంలో మంగళవారం మే డే పోస్టర్‌ను పీవైఎల్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యుడు మనోహర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. నాయకులు నగేశ్, రాజన్న, శంకర్, ప్రకాశ్, గణపతి, లక్ష్మి, సుశీల, కమల, ఆనంద్, తిరుపతి పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

దహెగాం, ఏప్రిల్ 29 : ఇందిరమ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ అన్నారు. మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల పైలెట్ గ్రామాన్ని (దిగడ) మంగళవారం ఆయన సందర్శించారు. పనులను పరిశీలించారు. త్వరగా పునాది వరకు నిర్మాణాలు పూర్తిచేసి, బిల్లులు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య ఉందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరిత హారం నర్సరీని పరిశీలించారు. ఆ తర్వాత లగ్గాం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ చేస్తున్న అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం సందర్శించి, రాజీవ్ యువవికాసం వివరాలు అడిగారు. ఇన్‌చార్జి ఎంపీడీవో అల్బర్ట్, ప్రత్యేకాధికారి సాజీవన్, ఎంపీవో రవి, మిషన్ భగీరథ డీఈ సిద్ధిక్, ఏఈ వినోస్, ఏపీవో కల్పన తదితరులు పాల్గొన్నారు.

**నీటి ఎద్దడి లేకుండా చూడాలి..**

పెంచికల్ పేట్, ఏప్రిల్ 29 : వేసవి పథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. మండలంలోని ఎల్లూరు గ్రామాన్ని సందర్శించారు. అవసరం ఉన్న చోట బోర్లకు మోటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్ఐ కొమురయ్య ఆధ్వర్యంలో వేసిన బోరును పరిశీలించారు. డీఎల్పీవో ఒమర్, ఎంపీడీవో అల్బర్ట్ ఉన్నారు.

## అక్షరాస్యతపై అవగాహన

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 29 : అందరూ చదవాలి అందరూ ఎదగాలి కార్యక్రమంలో భాగంగా మండలంలోని మారుమూల గిరిజన మొర్లిగూడ గ్రామంలో మంగళవారం ప్రజలకు ఉపాధ్యాయుడు సందిళ్ల రమేశ్ అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ముందస్తు బడిబాట, విద్యా ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిరోధం, బాల కార్మిక నిర్మూలన, మద్యపాన నిషేధం తదితర అంశాలపై వివరించారు. పంచాయతీ కార్యదర్శి రాకేశ్, గ్రామస్తులు ప్రభాకర్, రాజు, బాబు, గణపతి, రాజు, వెంకటి, దివాకర్, తానాజీ, శంకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ లోన్లకు ఇంటర్వ్యూలు

బెజ్జూర్, ఏప్రిల్ 29 : రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్‌తో పాటు, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ కింద గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న యువకులకు ఎంపీడీవో కార్యాలయంలో మే 2 నుంచి 7వ తేదీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2న మొగవెల్లి, సోమిని, సుస్మీర్, తలాయి, పాపన్ పేట, కుశ్నపల్లి.., 3న ఊట్సారంగపల్లి, సులుగుపల్లి, మర్తిడి, లంబాడిగూడ.., 5న అందుగులగూడ, కుంటలమానెల్లి, తుమ్మలగూడ, రెబ్బెన.., 6న ముంజంపల్లి, మారెగూడ, కుకుడ, పోతెపల్లి, కాటెపల్లి, అంబాగట్.., 7న బెజ్జూర్, పెద్దసిద్దాపూర్ అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరవ్వాలని సూచించారు.

## పనుల పరిశీలన

దండేపల్లి, ఏప్రిల్ 29 : దండేపల్లి మండలం మామిడిపెల్లి, మోకాసిగూడ, తాళ్లపేట, గుడిరేవు, లక్ష్మీకాంతాపూర్, వెల్గనూర్, రంగంపెల్లి, గూడెం, రెబ్బెన్‌పెల్లి పాఠశాలల్లో 'మన ఊరు–మన బడి'లో భాగంగా జరుగుతున్న పేయింటింగ్ పనులను ఎంఈవో దుర్గాప్రసాద్ పర్యవేక్షించారు. సీఆర్పీ రాజ్‌మహ్మద్, మండల పరిషత్ అధికారులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

మందమర్రి, ఏప్రిల్ 29 : సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్, సివిల్ కార్యాలయాల ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఏరియా జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సివిల్ కార్యాలయంలో డీవైజీఎం రాములుకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎండీ జాఫర్, మహేశ్వరి, కనకయ్య, గణేశ్, భూమయ్య, వెంకటస్వామి, మణిరాంసింగ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో ప్రతిభ

దండేపల్లి, ఏప్రిల్ 29 : జాతీయస్థాయి కుంగ్‌ఫు కరాటే పోటీల్లో దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల లక్ష్మణ్ బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్ అందుకున్నాడు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో మంకీఫిస్ట్–కుంగ్‌ఫు స్పోర్ట్ అథారిటీ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్, బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ రాష్ట్ర కార్యదర్శి బచ్చల అంజన్న, బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ ఆసాది పురుషోత్తం, సంకె రవి, అల్లనూరి రాజారావు, సీహెచ్ మదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతిపై అవగాహన

వేమనపల్లి, ఏప్రిల్ 29 : భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు కలుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మండలంలోని 19 మంది లబ్ధిదారులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్, నాయకులు సాబీర్ అలీ, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే కొత్త చట్టం

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 29 : భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఆయన హాజరయ్యారు. తహసీల్దార్ రోహిత్, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## విరమణ ఉద్యోగికి సన్మానం

జన్నారం, ఏప్రిల్ 29 : జన్నారం డివిజన్‌లోని ఇందన్‌పెల్లి రేంజ్‌లో అటెండర్‌గా పని చేసి ఏప్రిల్ 30వ తేదీ విరమణ పొందుతున్న మేకల సంజీవరావు దంపతులను రేంజ్ ఆఫీసర్‌తో పాటు, సిబ్బంది సన్మానించారు. 41 ఏళ్లు అటవీశాఖకు సేవలందించి, అధికారుల మన్నలు పొంది విరమణ పొందడం సంతోషదామకమని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మక్కుబుల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి, ఏప్రిల్ 29 : బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఒక బార్ లైసెన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. గతంలో నోటిఫికేషన్ ఇవ్వగా కేవలం ఒక దరఖాస్తు మాత్రమే వచ్చిందని, మరోసారి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 5న సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులు సమర్పించేందుకు గడువు పెంచినట్లు తెలిపారు. 6న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో లక్కీ డ్రా తీయనున్నట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో గానీ, 87126 58785 నంబర్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

## బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీగా సుధాకర్

కాసిపేట, ఏప్రిల్ 29 : బెల్లంపల్లి బార్ అసోసియేషన్ స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా కాసిపేట మండలం కోమటిచేనుకు చెందిన న్యాయవాది మాసు సుధాకర్ ఎన్నికయ్యారు. గతంలో నిర్వహించిన ఎన్నికల్లో మిగిలిన స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీకి ఇద్దరు న్యాయవాదులు పోటీపడగా, సుధాకర్ ఒక్క ఓటుతో గెలుపొందారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

మందమర్రి, ఏప్రిల్ 29 : మందమర్రి ఏరియాలోని సింగరేణి సూపర్‌వైజర్లకు క్వార్టర్లు కేటాయించేందుకు పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాకు 20 క్వార్టర్లు ప్రకటించగా, 10 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియారిటీ ప్రకారం ఎనిమిది మందికి కేటాయించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తెలిపారు. ఎస్వోటూ జీఎం విజయ్ ప్రసాద్, డీవైపీఎం మైత్రేయ బంధు పాల్గొన్నారు.

## వేణుకుమార్ విగ్రహం ఏర్పాటు చేయాలి

రెబ్బెన, ఏప్రిల్ 29 : రెబ్బెన మండల కేంద్రంలో తెలంగాణ మలిదశ అమరవీరుడు తాళ్లపెల్లి వేణుకుమార్‌గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని, మండల కేంద్రానికి అతడి పేరు పెట్టాలని వివిధ పార్టీల నాయకులు కోరారు. ఈ మేరకు వేణుకుమార్ గౌడ్ తండ్రి ప్రభాకర్‌గౌడ్ తండ్రితో కలిసి తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు పల్లె రాజేశ్వర్ రావు, నాయకులు కేసరి అంజనేయులుగౌడ్, వేముర్ల సంతోష్, నాసీర్‌ఉస్మానీ, రాకేశ్, కృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

## స్థలాల పరిశీలన

రెబ్బెన, ఏప్రిల్ 29 : 363వ జాతీయ రహదారి (మంచిర్యాల–వాంకిడి) ప్రారంభోత్సవానికి మే 5న కేంద్ర మంత్రి నితన్ గడ్కరీ రానుండగా, రెబ్బెన మండలం కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్ వద్ద సభా స్థలం, హెలీప్యాడ్ ప్రాంతాలను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మంగళవారం సందర్శించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, ఎంపీ నగేశ్‌తో పాటు, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొంటారని ఆయన తెలిపారు. జాతీయ రహదారుల సంస్థ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఆయన వెంట ఉన్నారు.